క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న రవి

నల్లగొండ: స్థానిక పట్టణ ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ భవనంలో ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు కంభంపాటి రవి మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఫొటోగ్రాఫర్లు నూతన టెక్నాలజీ నేర్చుకోవడానికి వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తామన్నారు.

ఎస్సీ మోర్చా ఇన్‌చార్జ్‌గా మాస శ్రీనివాస్



చిట్యాల: భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ బీజేపీ ఎస్సీ మోర్చా ఇన్‌చార్జ్‌గా చిట్యాల పట్టణానికి చెందిన మాస శ్రీనివాస్‌ను నియమిస్తూ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరిలో బీజేపీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

క్యామ మల్లేశ్‌కు గట్టుప్పల్ నాయకుల మద్దతు



భువనగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌తో గట్టుప్పల్ మండల నాయకులు

చండూరు(గట్టుప్పల్) : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గట్టుప్పల్ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఇడెం కైలాసం హైదరాబాద్‌లో కలిసి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో మర్రిగూడ మాజీ ఎంపీపీ అనంత రాజుగౌడ్, మంగ వెంకటేశ్, మాజీ సర్పంచ్ పోరెడ్డి ముత్తిరెడ్డి తదితరులు ఉన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా పెంబళ్ల జానయ్య



మునుగోడు: బీజేపీ మునుగోడు మండల అధ్యక్షుడిగా మండలంలోని చొల్లేడు గ్రామానికి చెందిన పెంబళ్ల జానయ్య నియమితులయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఆదివారం జానయ్యకు నియామక పత్రాన్ని అందజేశారు. జానయ్య 15 ఏళ్లుగా బీజేపీలో పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ మంత్రిని కలిసిన కంచర్ల కృష్ణారెడ్డి




జగదీశ్‌రెడ్డికి బొకే అందజేస్తున్న కృష్ణారెడ్డి

నల్లగొండ టూటౌన్: బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ నియోజకవర్గ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి ఆదివారం హైదరాబాదులోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి ఉన్నారు.

నేడు రథోత్సవం

మర్రిగూడ: మండలంలోని శివన్నగూడలో శ్రీ నీలకంఠ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాపోలు యాదగిరి ఆదివారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో రథోత్సవంలో పాల్గొనాలని కోరారు.

బూత్ కమిటీల ఎన్నిక



నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

మునుగోడు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం బీజేపీ బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనం వేణు, కార్యదర్శి బొడిగె అశోక్‌గౌడ్, మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్యల ఆధ్వర్యంలో నూతన కమిటీలను ఎన్నుకుని నియామక పత్రాలు అందించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ జెడ్పీటీసీ ముంగి చంద్రకళ, మాదగోని నరేందర్‌గౌడ్, బండారి యాదయ్య, అంతిరెడ్డి, కంభంపాటి నర్సింహ, బొల్లూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతుచిక్కని జ్వరాలతో అవస్థలు

- ఎర్రగడ్డలగూడెం గ్రామంలో నగం మందికి జ్వరాలు
- రెండు నెలలు గడుస్తున్నా తగ్గని తీవ్రత
- ప్రత్యేక క్యాంపు ఏర్పాటుచేసి చికిత్స అందిస్తున్న వైద్యులు



ఎర్రగడ్డలగూడెంలో బాధితులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కొండల్‌రావు (ఫైల్)



జ్వరంతో మంచాన పడిన గ్రామస్తుడు

రామగిరి(నల్లగొండ): ముందుగా జ్వరం వస్తోంది. ఆ తర్వాత ఉన్నట్టుండి కాళ్లు, చేతులు, ముఖం వాపులు వస్తున్నాయి. నొప్పులు తీవ్రంగా ఉంటున్నాయి. జ్వరం తగ్గినప్పటికీ కీళ్ల నొప్పులు మాత్రం అలాగే ఉంటున్నాయి. ఇలా అంతు చిక్కని అస్వస్థతో తిప్పర్తి మండలంలోని ఎర్రగడ్డలగూడెం గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. రెండు నెలలుగా స్థానికంగా ఫీవర్ క్యాంపు ఏర్పాటుచేసి చికిత్స అందిస్తున్నా తగ్గుముఖం పట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాన్ని ఇప్పటికే జిల్లా, రాష్ట్ర వైద్యం బృందం పరిశీలించారు. గ్రామంలో సుమారు 1400 వందలకు పైగా జనాభా ఉండగా సగంమంది ప్రజలు జ్వరం బారిన పడ్డారు.

గ్రామాన్ని సందర్శించిన రాష్ట్ర వైద్యులు..

ఎర్రగడ్డలగూడెం గ్రామంలో జ్వర పీడితుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో రాష్ట్ర వైద్య బృందం సందర్శించారు. ఈ నెల 21 జిల్లా వైద్యాధికారి డాక్టర్ కొండల్‌రావు గ్రామంలోని ఫీవర్ క్యాంపును సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. మరుసటి రోజు డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ ఆదేశాల మేరకు సర్వేలెన్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శివ బాలాజీ నేతృత్వంలో గ్రామంలో పర్యటించారు. మార్చి 23వ తేదీన ఎంటమాలజీ డైరెక్టర్లు విజయ్‌కుమార్, నాగయ్య సందర్శించి గ్రామంలోని డ్రెయినేజీల్లో దోమ లార్వా, దోమలను సేకరించి నిర్ధారణ కోసం హైదరాబాద్ లాబోలేటరీకి పంపించారు.

నొప్పులు తగ్గడం లేదు



నాకు ముందుగా తీవ్ర జ్వరం వచ్చింది. అప్పటి నుంచి తట్టుకోలేని విధంగా నొప్పులు వస్తున్నాయి. ఎన్ని మందులు వేసుకున్నా, ఇంజక్షన్లు వేయించుకున్నప్పటికీ తగ్గడం లేదు. నొప్పులతో తీవ్ర ఇబ్బంది పడుతున్నా.

–గాలి వెంకన్న

నల్లటి మచ్చలు వస్తున్నాయి



ఇంట్లో ఆరుగురు కుటుంబ సభ్యులు ఉన్నాం. ఐదుగురు జ్వరంతో బాధపడుతున్నాం. జ్వరం తగ్గింది కాని శరీరమంతా నొప్పులు, వాపులతో తట్టుకోలేకపోతున్నా. ముఖంపై నల్లటి మచ్చలు వస్తున్నాయి.

–గండమల్ల రాములమ్మ

ఫీవర్ క్యాంపు కొనసాగుతోంది

ఇప్పటివరకు 125 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. 5 డెంగ్యూ కేసులు, 4 టైఫాయిడ్ కేసులు వచ్చాయి. యాంటీ బయాటిక్, నొప్పులకు మందులు ఇస్తున్నాం. జిల్లా వైద్య శాఖ ఆదేశాల మేరకు వైద్య సేవలు అందిస్తున్నాం. ఫిబ్రవరి 3వ తేదీ డెంగ్యూ కేసు వచ్చింది. ఫిబ్రవరి 8 నుంచి 25 వరకు ఫీవర్ క్యాంపు నిర్వహించాం. మళ్లీ మార్చి 19 నుంచి ఫీవర్ క్యాంపు కొనసాగుతోంది.

–డాక్టర్ అంతుల్ తహియా, క్యాంపు ఇన్‌చార్జ్, తిప్పర్తి పీహెచ్‌సీ

క్రీడాకారులకు టీ షర్టుల పంపిణీ



టీషర్టులు అందజేస్తున్న చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: వైఎంసీఏ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీ కళాశాలలోని బాస్కెట్‌బాల్ కోర్టు వద్ద కోమటిరెడ్డి ప్రతీక్ స్మారకార్థం క్రీడాకారులకు టీ షర్టుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైఎంసీఏ ద్వారా 12 సంవత్సరాలుగా వేసవి క్రీడా శిబిరాలు, చలివేంద్రాలు, దుప్పట్ల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, కోమటిరెడ్డి ప్రతిక్ ఫౌండేషన్ సీఈఓ ఎంపీ గోనారెడ్డి, వైఎంసీఐ జిల్లా అధ్యక్షుడు టీఎస్ విలియమ్స్, రేఖల భద్రాద్రి, డాక్టర్ పుల్లారావు, పసల శౌరయ్య, జునైట్ హస్మి, డాక్టర్ ఏ ఏ ఖాన్, వైఎంసీఏ జనరల్ సెక్రెటరీ ఫ్రాన్సిస్, వాకర్ అసోసియేషన్ కార్యదర్శి కట్ట వెంకట్ రెడ్డి, భీమార్జున్‌రెడ్డి, దుబ్బ అనిల్ కుమార్, బెట్టి పాల్గొన్నారు.

పేద కుటుంబానికి పెళ్లి కానుక అందజేత



పెళ్లి కానుక అందజేస్తున్న వనమా వెంకటేశ్వర్లు

చిట్యాల: ఉరుమడ్ల గ్రామంలో పేద కుటుంబానికి చెందిన గుంటోజు లక్ష్మీ కూతురు దక్షితకు గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి సమకూర్చిన రూ.25 వేలను ఆదివారం గుత్తా యువసేన అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు అందజేశారు. కార్యక్రమంలో పల్లపు బుద్ధుడు, జన్నపాల శ్రీను, గుంటోజు శ్రీనివాస్, వెంకన్న, నర్సింహ, సైదులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కేతేపల్లి: మండలంలోని తుంగతుర్తి గ్రామానికి చెందిన దోనాల మమత అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మమత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మందడి వెంకట్రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్, కీర్తి వెంకన్న, మట్టి సాల్మన్, కప్పల సైదులు తదితరులు ఉన్నారు.

హరితహారం చెట్లపై అధికారుల నిర్లక్ష్యం



ఇనుపాముల వద్ద రోడ్డు వెంట కాలిపోయిన చెట్లు

కేతేపల్లి: హరితహారంలో భాగంగా జాతీయ రహదారికి ఇరువైపులా అటవీశాఖ ఆధ్వర్యంలో గతంలో రెండు వరుసలా మొక్కలు నాటారు. అటవీ శాఖ సిబ్బంది మొక్కలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, నీళ్లుపోసి సంరక్షించడంతో ఏపుగా పెరిగాయి. అయితే ఇనుపాముల శివారులో మల్ల న్న గుట్ట వద్ద రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తులు చెత్తను తగులబెట్టడంతో చెత్తతోపాటు ఏపుగా పెరిగిన పచ్చని చెట్లు సైతం కాలిపోయాయి. గత ఏడాది నుంచి చెట్ల సంరక్షణపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కొంతమంది ఆకతాయిలు ఏపుగా పెరిగిన చెట్లను నరకడంతోపాటు, నిప్పు వేసి తగులబెడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

శాలిగౌరారం: మండలంలోని గురుజాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2002–03 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు ఆదివారం స్థానిక పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని ఆనందంగా గడిపారు. నాడు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు చంద్రమౌళి, సాంబయ్య, అశోక్, రాంరెడ్డిలను పూర్వ విద్యార్థులు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి, మెమోంటోలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో 2002–03 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థుల కమిటీ ప్రతినిధులు అనిల్‌కుమార్, స్వాతి, నాగయ్య, సైదులు, శ్రీశైలం, గంగమల్లు, మంగలతోపాటు పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

యాసంగి వరికోతలు ప్రారంభం



వరిచేను కోయిస్తున్న రైతు

శాలిగౌరారం: యాసంగి వరి చేల కోత పనులు శాలిగౌరారం మండలంలో ప్రారంభమయ్యాయి. శాలిగౌరారం ప్రాజెక్టు ఆయకట్టు మినహా నాన్ ఆయకట్టులో వరికోతలు కొనసాగుతున్నాయి. శాలిగౌరారం ప్రాజెక్టు కింద ఆయకట్టులో మరో 20 రోజుల తర్వాత వరికోతలు ప్రారంభం కానున్నాయి. మండలంలో వరికోతలు ఏప్రిల్ చివరి వరకు జరుగనున్నాయి.

17,500 ఎకరాల్లో వరి సాగు

వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం శాలిగౌరారం మండలంలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో మొత్తం 17,500 ఎకరాల్లో వరి సాగుచేశారు. అందులో శాలిగౌరారం ప్రాజెక్టు ఆయకట్టుతోపాటూ ఆయకట్టు పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ బోరు బావుల కింద కలిపి సుమారు 6500 ఎకరాలు సాగు చేశారు. కాగా నాన్ ఆయకట్టు గ్రామాల్లో 11 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. శాలిగౌరారం ప్రాజెక్టు కింద శాలిగౌరారం, తిరుమలరాయనిగూడెం, రామగిరి, శాలిలింగోటం, అంబారిపేట, గురుజాల, తుడిమిడి, అడ్లూరు, ఊట్కూరు, బండమీదిగూడెం గ్రామాలు ఉన్నాయి. నాన్‌ఆయకట్టుగా భైరవునిబండ, తక్కెళ్ళపహాడ్, ఆకారం, వల్లాల, పెర్కకొండారం గ్రామాలతోపాటూ మూసీనది పరివాహక ప్రాంతాలుగా ఉన్న ఉప్పలంచ, మనిమద్దె, గురుజాల, తుడిమిడి, చిత్తలూరు, వంగమర్తి, ఇటుకులపహాడ్ గ్రామాలు ఉన్నాయి. మూసీనది పరివాహక రైతులు మూసీనదిలోని ఇసుక బోర్ల ద్వారా వరి సాగుచేశారు. నాన్ ఆయకట్టు గ్రామాలతోపాటూ మూసీనది పరివాహక ప్రాంతాల్లో యాసంగి సీజన్‌లో ముందస్తుగా వరికోతలు ప్రారంభమయ్యాయి. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

హోలీ వేడుకలు ప్రారంభం

మునుగోడు: మండలంలోని కిష్టాపురం గ్రామంలో ఆదివారం హోలి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆ గ్రామంలో వేణుగోపాల స్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా రథోత్సవం నిర్వహించిన మరుసటి రోజు హోలీ పండుగ జరుపుకుంటారు. వేడుకల్లో ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



కిష్టాపురంలో హోలీ ఆడుతున్న యువకులు

కాముడి దహనం



నాంపల్లిలో కాముడి దహనం కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

నాంపల్లి: హోలీ వేడుకల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం కాముడి దహనం కార్యక్రమం నిర్వహించారు. గాదెపాక రమేష్, పానగంటి వెంకటయ్య, బిరుదోజు సుదర్శన్‌చారి, కొరెముత్తి రాములు, కామిశెట్టి యాదయ్య, నాంపల్లి హనుమంత్, శ్రీకాంత్, ఎడుళ్ల రాములు, మల్లయ్య, యోహోన్, పెద్దయ్య, పూల శ్రీను, వెంకటయ్య, మహిళలు, తదితరులు ఉన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు



కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనులు



ఆలయం సమీపంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

- రూ.12.40 కోట్ల వ్యయంతో వంతెన, సీసీ రోడ్డు, డ్రెయినేజీ
- దర్వేశిపురం ఆలయం వద్ద నిర్మాణం
- తీరనున్న వాహనదారుల తిప్పలు

కనగల్: దర్వేశిపురం– పర్వతగిరి గ్రామాల మధ్య అయిలేరు వాగుపై వంతెన నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. రూ.12.40 కోట్ల వ్యయంతో ఆలయం వద్ద అభివృద్ధి పనులు జరుగుతుండడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కనగల్ మండల పరిధిలోని దర్వేశిపురం ఆలయానికి సమీపంలో పుష్కరఘాట్ వద్ద ఉన్న అయిలేరు వాగుపై నిజాం కాలంలో రాతితో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరి ఇరుకుగా మారింది. దాని పక్కనే నూతన వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.12.40 కోట్ల నిధులను మంజూరు చేయగా ప్రస్తుతం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

రాకపోకలకు ఇబ్బందులు

నల్లగొండ–మహబూబ్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. ఈ వంతెనపై భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం ఉన్న వంతెనను అలాగే ఉంచి పక్కనే హైలెవల్ వంతెన నిర్మిస్తున్నారు. అదేవిధంగా ఆలయానికి ఇరువైపులా వంద మీటర్ల మేర సీసీ రహదారిని నిర్మిస్తున్నారు. ఇప్పటికే సగం పనులు కూడా పూర్తికావొస్తున్నాయి. ఈ రహదారి నల్లగొండ–మహబూబ్‌నగర్, హైదరాబాద్–నాగార్జునసాగర్ రహదారికి అనుసంధానంగా ఉండడంతో జిల్లా కేంద్రం నుంచి వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది. ప్రస్తుత వంతెన 24 ఫిల్లర్లతో 3 మీటర్ల ఎత్తు, 6.50 మీటర్ల వెడల్పుతో ఉంది. భవిష్యత్‌లో నల్లగొండ–దేవరకొండ ప్రధాన రహదారి నాలుగు వరుసల రహదారి కానుండడంతో 10 ఫిల్లర్లు, 10 మీటర్ల వెడల్పు, అప్రోచ్ రోడ్డుతో నూతన వంతెన నిర్మిస్తున్నారు.

అభివృద్ధి పనులకు మంత్రి కోమటిరెడ్డి శంకుస్థాపన..

వంతెన, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన సూచనల మేరకు అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తూ పనులు త్వరితగతిన చేయిస్తున్నారు.

ఆలయం వద్ద సెంట్రల్ లైటింగ్..

అభివృద్ధి పనుల్లో భాగంగా ఆలయం సమీపంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే రోడ్డుకు ఆనుకుని ఉన్న దుకాణాలను అధికారులు తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా హద్దులను గుర్తించి డ్రెయినేజీ, విద్యుత్ లైనింగ్, సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. పట్టణాల్లో మాదిరిగా డ్రెయినేజీపై ఫుట్‌పాత్ నిర్మించనున్నారు. ఈ పనులన్నీ పూర్తయితే ఆలయం వద్ద నూతన శోభ సంతరించుకోనుంది.

ఇక్కట్లు తొలగనున్నాయి



ఆలయం సమీపంలో వంతెన, సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే వాహనదారుల ఇక్కట్లు తొలగనున్నాయి. గతంలో ఆలయం వద్ద రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు నానా ఇబ్బందులు పడేవారు. వంతెన, సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులను పారదర్శకంగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులు చూడాలి.

– కూసుకుంట్ల రాజిరెడ్డి, చర్లగౌరారం

ఆరు నెలల్లో పనులు పూర్తి చేస్తాం



వంతెన నిర్మాణం పూర్తయితే నల్లగొండ–దేవరకొండ ప్రధాన రహదారి రవాణా సౌకర్యం మరింత మెరుగుపడనుంది. పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నాం. వంతెన నిర్మాణం, ఆలయానికి ఇరువైపులా సీసీ రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నాణ్యతాప్రమాణాలతో పనులు ఆరు నెలల్లో పూర్తిచేస్తాం.

– దినేష్ రెడ్డి ఆర్అండ్‌బీ ఏఈ

నేటి నుంచి ఆలయ పునః ప్రతిష్ఠాపన ఉత్సవాలు



గురుజాల గ్రామంలోని శ్రీవిశాలాక్షి సమేత కాశీవిశ్వనాథేశ్వరస్వామి ఆలయం

శాలిగౌరారం: మండలంలోని గురుజాల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీవిశాలాక్షి సమేత కాశీవిశ్వనాథేశ్వరస్వామి ఆలయం పునః ప్రతిష్ఠాపన ఉత్సవాలు నేడు ప్రారంభమై మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. రూ.1.50 కోట్ల నిధులతో నిర్మించిన ఈ ఆలయానికి రూ.50 లక్షలు ప్రభుత్వం మంజూరు చేయగా కోటి రూపాయలు దాతలు అందించారు. కాకతీయుల కాలంలో నిర్మితమై ఉన్న అత్యంత పురాతన ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలిపోయేందుకు సిద్ధం కావడంతో గ్రామస్తులు ఆలయ పునర్నిర్మాణానికి ముందుకు వచ్చారు.

ప్రతిష్ఠాపన కార్యక్రమాలు

ఈ నెల 25న (సోమవారం) గణపతిపూజ, పుణ్యాహవాచనం, మాతృకాపూజ, రక్షాబంధన, దీక్షాధారణ, అఖండదీపస్థాపన, అంకురారోపణ, ప్రధాన కలశ స్థాపనలు, అగ్నిప్రతిష్ఠ, మంత్రపుష్పం, 26న (మంగళవారం) గురుప్రార్థన, మండప దేవతా పూజలు, మూలమంత్ర జపములు, జలధివాస ఉద్వాపన, అష్టోత్తరశత కలశాభిషేకం, ధాన్యాధివాసం, మూలమంత్రహోమములు, మంటప దేవతా హోమం, ఫలపుష్ప శయ్యాదివాసములు, 27న (బుధవారం) గురుప్రార్థన, మండప దేవతాపూజలు, హోమములు, యంత్ర, విగ్రహ, ప్రాణప్రతిష్ఠలు, నేత్రోన్మీలన కుంభదర్శనం, మహాపూర్ణాహుతి, ఆశీర్వచనం కార్యక్రమాలు జరిపించనున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

• హోలీ సందడి



రామగిరిలో రంగులు కొనుగోలు చేస్తున్న ప్రజలు



ప్రకాశంబజార్‌లో రంగులు కొనుగోలు చేస్తున్న ప్రజలు



మార్కెట్‌లో వివిధ రకాల రంగులు



హోలీ రంగులు కొట్టే గన్నులు

హోలీ పండుగ సందర్భంగా నల్లగొండ పట్టణంలోని ప్రకాశంబజార్, రామగిరి, వీటీ కాలనీ, దేవరకొండ రోడ్డు, శివాజీనగర్, సావర్కర్‌నగర్‌లలో దుకాణాల వద్ద సందడి నెలకొంది. ప్రజలు మార్కెట్‌లో వివిధ రకాల రంగులతోపాటు రంగులు కొట్టే గన్నులు కొనుగోలు చేస్తున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ